సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 14 । డిసెంబర్ । 2024



**వృద్ధులపై యువకుడి దాడి**
పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధులపై.. ఓ యువకుడు దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అతను మద్యం మత్తులో గ్రామంలో వీరంగం సృష్టించాడు. - 8లో



**ఆధ్యాత్మిక నిలయం..జ్యోతిక్షేత్రం**
జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతుంది. ఈ క్షేత్రంలో శ్రీఅవధూత కాశినాయన ఆరాధన మహోత్సవాలు ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్నాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.140 | రూ.180 |
| రెండోరకం | రూ.90 | రూ.110 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 500 | 500 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 56.320 కిలోలు

# దగాపై దండయాత్ర





కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు , జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మదనపల్లె ఇన్‌చార్జి నిసార్ అహ్మద్, మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

## అన్నదాతకు అండగా కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద కొనసాగిన ధర్నా
- రైతులకు హామీలు ఇచ్చి విస్మరించడంపై నినాదాల హోరు
- జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న రైతులు

సాక్షి రాయచోటి/రాయచోటి : అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా అన్నదాతను ఆదుకోవడంలో మీనవేషాలు లెక్కిస్తున్న కూటమి సర్కార్‌పై వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరించింది. వైఎస్సార్ సీపీ హయాంలో వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని రైతులకు అండగా నిలబడాలని పార్టీ శ్రేణులు నినదించాయి. ఎన్నికల్లో హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయకుండా సాకులు చూపుతున్న ప్రభుత్వం దిగి రావాలంటూ శ్రేణులు రోడ్డెక్కాయి. తక్షణమే పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ...సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికార పగ్గాలు చేపట్టి ఆరు నెలలు దాటినా నేటికీ రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం కళ్లు తెరిపించడమే లక్ష్యంగా 'అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమానికి కడలి తరంగంలా కదిలివచ్చారు.

### కలెక్టరేట్ వద్ద నిరసన

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ ఎదురుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి. ప్రస్తుత కూటమి సర్కార్ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ...అన్నదాతకు అండగా నిలబడాలన్న మహాసంకల్పంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, ప్రజాప్రతినిధులు కదలివచ్చారు. రాయచోటిలోని కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కష్టాల్లో ఉన్న కర్షకులను వెంటనే ఆదుకోవాలని, ఇప్పటికే ఖరీఫ్ కోల్పోయిన అన్నదాతకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. కార్యకర్తలు వైఎస్సార్ సీపీ జెండాలు చేతబూని...దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ నిరసనను హోరెత్తించారు. జిల్లాలోని రాజంపేట, రాయచోటి, మదనపల్లె, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అయితే పోలీసులు 30 యాక్టు అమలులో ఉన్న నేపథ్యంలో పట్టణంలో ర్యాలీకి అనుమతులు లేకపోవడంతో...కలెక్టరేట్ ప్రధాన గేటు నుంచి కార్యాలయం వరకు వచ్చిన వారంతా ర్యాలీగా వెళ్లారు. వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి....ప్రభుత్వం రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు.

### రైతులను ఆదుకోవాలని జేసీకి వినతి

ప్రస్తుతం ఖరీఫ్ పంటలను కోల్పోయి...రబీలో కూడా వర్షాలతో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ తరపున రైతులు జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రా రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ తదితరులు జేసీకి వినతిపత్రం సమర్పించారు. రైతులను ఆదుకునే దిశగా, ప్రభుత్వం స్పందించేలా చర్యలు చేపట్టాలని వారు జేసీని కోరారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మదనపల్లె మున్సిపల్ చైర్మన్ మనూజ,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జిల్లా వ్యవసాయ సలహా అధ్యక్షుడు సుకుమార్‌రెడ్డితోపాటు ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### అన్నదాత సుఖీభవ నిధులు తక్షణమే అందించాలి

చంద్రబాబు చెప్పిన ష్యూరిటీ ఏమో గానీ ప్రజలపై బాదుడు మాత్రం గ్యారంటీ అయిందని, వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు దాని గురించి ఆలోచన చేయడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూటమి ప్రభుత్వం కల్పించలేదని మండిపడ్డారు. ఎన్నిలకు ముందు ఏ ఛార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక అన్ని వస్తువులపై రేట్లను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరిట వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్ అని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్వచ్ఛందంగా జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన రైతులకు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



### రైతు గోడును పట్టించుకోని చంద్రబాబు

రైతు గోడును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలను ఇచ్చి, పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా ముంచేసిందన్నారు. వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. జగన్ హయాంలో రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా విరాజిల్లిన రైతు భరోసా కేంద్రాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు జగన్‌హయాంలో ఠంచనుగా అన్ని వర్గాలకు సంక్షేమం అందేదని, బాబు వచ్చిన తర్వాత సంక్షేమానికి ఎగనామం పెట్టడమే కాదు...మళ్లీ పథకాల్లో కోతలకు తెర తీస్తున్నారని మండిపడ్డారు.



### కరవు మండలాల ప్రకటనలతోనే సరిపెట్టారు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడు, ఇప్పుడు రైతు వ్యతిరేకేనని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు.కరవు మండలాల ప్రకటనలతోనే సరిపెట్టారన్నారు. కరవు ప్రాంతం రైతులకు కూటమి ప్రభుత్వం మేలు చేయలేదన్నారు. రైతులకు సంబంధించిన పాల ధరల విషయంలో లీటరుకు పది రూపాయలు వంతున తగ్గించి కష్టపడుతున్న వారి నడ్డి విరిచారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెడుతూ వారిపై భౌతిక దాడులకు తెగబడుతున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇకనైనా రైతులపై దయచూపాలన్నారు. రైతులకు, ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామిలు నెరవేర్చకపోతే రానున్న కాలంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



### ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఆరు నెలల పాలనా కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు విస్వాసం కోల్పోయారని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. ఉచిత గ్యాస్ అనుకున్న రీతిలో అందలేదన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మహిళలకు హుళక్కేనన్నారు. రైతు భరోసా కేంద్రాలను, గ్రామ సచివాలయ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు ఇవ్వడం లేదన్నారు. వాలంటీర్లకు రూ 10 వేలు జీతంగా ఇస్తామన్న చంద్రబాబు ఏకంగా వారిని తొలగించి వారి కుటుంబాలను రోడ్డుపై పడేశారన్నారు. అన్ని విధాలుగా దగా చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజా ఉద్యమాలతో నైనా కనువిప్పు కలగాలని పేర్కొన్నారు.



### రైతుల ఉసురు తగలక తప్పదు

ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు, రైతుల ఉసురు తప్పక తగులుతుందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ అన్నారు. చంద్రబాబు కూటమికి ప్రజలు ఓట్లు వేసినందుకు సిగ్గుపడుతున్నారన్నారు. సామాన్యునికి అందనంత విధంగా నిత్యావసరాల ధరలను పెంచేసారన్నారు. కూటమి పాలనలో మితిమీరిన అవినీతి, అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలు, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తుండడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యవహారాలకు స్వస్తి పలకాలన్నారు.



### కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

కూటమి ప్రభుత్వం అన్నింట్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు గౌరవం ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎండగడుతోందన్నారు. ఇబ్బందులు పడుతున్న ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలిచిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటూ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## న్యూస్‌రీల్

### స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనలో భాగస్వాములై స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ అధికారులకు సూచించారు. శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో వర్చువల్‌గా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌లో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి ఆవిష్కరించిందన్నారు. ఆయా అంశాలలో అభివృద్ధిని సాధించి జిల్లా మరియు స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు కృషి చేద్దామని జేసీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముదివేడు కేజీబీవీ టీచర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నిర్మలమ్మ

కురబలకోట : కురబలకోట కస్తూర్బా (కేజీబీవీ) స్కూల్ తెలుగు టీచర్ బిసన నిర్మలమ్మకు రాష్ట్ర స్థాయి ప్రతిభ పురస్కారం లభించింది. తెలుగుభాష అభివృద్ధికి కృషి చేసినందుకు హైదరాబాదు దేవులపల్లె రామానుజరావు కళా మందిరంలో సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ, ఆంగ్ల ప్రొఫెసర్ మాధవరెడ్డి, జీర్కే గ్రూపు డైరెక్టర్ బి. రూపకుమార్‌రెడ్డి, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మన సంస్కృతి పత్రిక నిర్వాహకులు మస్తాన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఇదే పాఠశాలకు చెందిన ఎనిమిదివ తరగతి విద్యార్థి డి. అంజలి తెలుగు ప్రతిభ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎం.ప్రణవ్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో రాణించి ప్రతిభ అవార్డులు అందుకున్నట్లు కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్ రఫియా పర్వీన్ తెలిపారు.

## పాత్రికేయులపై దాడులను అరికట్టాలి



రాయచోటిలో జేసీకి వినతి పత్రం అందజేస్తున్న మీడియా ప్రతినిధులు





వైఎస్సార్ జిల్లా పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న విలేకరులు

రాయచోటి : వైఎస్సార్ జిల్లా వేముల మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, రిపోర్టర్ రాజారెడ్డిపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా జర్నలిస్ట్ సంఘాలు..నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పాత్రికేయులపై దాడి చేసేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

### హేయమైన చర్య

మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య అని రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు ముక్తకంఠంతో ఖండించారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మీడియాపై జరిగిన దాడి గర్హనీయమన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తే పత్రికలపై దాడులకు పాల్పడి మీడియా గొంతు నొక్కడం మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి దాడిని తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లో మీడియాపై దాడి జరిగితే మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి అరెస్టు వరకు తీసుకెళ్లారన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన సాక్షి మీడియా మీద దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. రాజ్యాంగం హైదరాబాద్‌లో ఓ రకంగా, వైఎస్సార్ జిల్లాలో మరో రకంగా ఉంటుందా అని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగే రాయచోటిలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌ను రాయచోటికి చెందిన ఏపీయూడబ్ల్యుజే, వైఎస్‌ఆర్ ప్రెస్ క్లబ్, అన్నమయ్య జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు వైఎస్‌ఆర్ జిల్లా వేములలో నీటిసంఘం ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. మీడియా రంగం అంతా ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉందని పలువురు మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాలు పిలుపునిచ్చారు.

### దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

రాయచోటి టౌన్ : సాక్షి మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకరులు నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వలీబాషా, జనార్ధన్ రాజు, బసయ్య, సి. రమేష్ బాబు, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 16న కబడ్డీ జట్టుకు ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 16వ తేదీన జిల్లాస్థాయి కబడ్డీ జూనియర్ విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య తెలిపారు. 2005 జనవరి 12 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే అంతర్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9133480661, 9949304160 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 'జాతీయ లోక్ అదాలత్' ను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టులలో 20 బెంచీలను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్‌డీ రామగిడ్డయ్య

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం స్థానిక ఆ కార్యాలయంలో నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 9 మంది జూనియర్ అసిస్టెంట్స్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా, ఒకరికి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టమాట ధరలు పతనం

**ఆందోళనలో రైతులు**

మదనపల్లె సిటీ : టమాట ధరలు మళ్లీ పతనం అయ్యాయి. మొన్నటి వరకు 10 కేజీల క్రేట్ రూ. 400 ఉండగా తాజాగా రూ.180కి పడిపోయింది. దీంతో టమాట రైతులు లబోదిబోమంటున్నారు. ఉత్తర భారతదేశం నుంచి దిగుమతి అవుతున్న టమటా సరుకుతో నష్టాల బాటపట్టారు. పెట్టుబడి అయినా పొందుతామని ఎదురు చూసిన వీరికి ఒక్కసారిగా ధరలు కుప్పకూలడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉత్తర భారతదేశం నుంచి దిగుబడులు:**
మధ్యప్రదేశ్,ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర,ఛత్తీస్‌గడ్ ప్రాంతాల్లో టమాట పంట చేతికి రావడంతో దిగుబడులు పెరిగాయి. ఈ ప్రాంతాల టమాటాలు పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. మదనపల్లె మార్కెట్ నుంచి ఈ రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. అలాగే చెన్నైలో తుపాను కారణంగా ఎగుమతులు ఆగిపోయాయి. మదనపల్లె మార్కెట్‌లోని టమాటాలు స్థానికంగా మాత్రం అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయి.



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాట

**ఎకరాకు రూ.1.50 లక్షల దాకా ఖర్చు:**
ఎకరా భూమిలో టమాట పంట సాగు చేస్తే పంట కోత దశ వరకూ రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల దాకా ఖర్చు వస్తోంది. వాతావరణ మార్పుల కారణంగా పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. మదనపల్లె టమాట మార్కెట్‌లో గత నెల రోజులుగా ధరలు ఆశించిన స్థాయిలోనే ఉన్నాయి. 10 కేజీలు రూ.500-600 వరకు పలకగా నేడు రూ.180కి పడిపోయింది. నాలుగైదురోజులుగా ధరలు పడిపోతుండటంలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉత్తర భారతదేశంలో పంట దిగుబడులు వస్తుండటంతో సంక్రాంతి వరకు ధరలు పెరగకపోవచ్చునని వ్యాపారులు అంటున్నారు.

**మదనపల్లె మార్కెట్‌లో ధరల వివరాలు**

| తేదీ | మొదటి గ్రేడ్ (10 కేజీలు) | రెండవ గ్రేడ్ (10 కేజీలు) |
|---|---|---|
| 13-12-24 | రూ.180.00 | రూ.136.00 |
| 12-12-24 | రూ.240.00 | రూ.166.00 |
| 11-12-24 | రూ.280.00 | రూ.220.00 |
| 10-12-24 | రూ.200.00 | రూ.136.00 |
| 9-12-24 | రూ.220.00 | రూ.126.00 |

## క్లుప్తంగా

### అంకాలమ్మ ఆలయంలో చోరీ



తెరిచి ఉంచిన హుండీ

**ఓబులవారిపల్లె :** మండల పరిధి చెలంపాలెం గ్రామంలోని అంకాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. రోజూ లాగే శుక్రవారం ఉదయం గుడి తెరిచి చూడగా హుండీ పగులగొట్టిన దృశ్యాన్ని చూసి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న నగదు దోచుకెళ్లారు. చాలా రోజుల నుంచి హుండీలో డబ్బులు తీయకపోడంతో దాదాపు లక్ష రూపాయల పైనే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

### కూలిన ఇల్లు


కూలిన ఇంటి వద్ద బాధితుడు శ్రీనివాసులు

**రామాపురం :** మండలంలోని చిట్లూరు పంచాయతీ ముసలిరెడ్డిగారిపల్లెలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఓ ఇంటి పైకప్పు శుక్రవారం కూలిపోయింది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఓటేరు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. కూలి పని చేసుకొని జీవనం సాగించే తన కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోందని వాపోయాడు. ప్రభుత్వం తమకు సాయం చేసి ఆదుకోవాలని ఆయన కోరాడు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


బయ్యారెడ్డి(ఫైల్)

**ములకలచెరువు :** అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన బయ్యారెడ్డి(42) టమాటతోపాటు వివిధ పంటల కోసం రూ.16 లక్షల వరకు అప్పు చేశాడు. సరిగా దిగుబడి రాకపోవడంతో నష్టపోయాడు. అప్పులు ఇచ్చిన వారు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బయ్యారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

# ఆధ్యాత్మిక నిలయం.. జ్యోతి క్షేత్రం

- మహిమాన్వితుడు కాశినాయన
- నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు


కాశినాయన సమాధి


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షామియానాలు


వంటలకు కూరగాయలు తరుగుతున్న భక్తులు

**కాశినాయన :** జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతోంది. ఇక్కడ కొలువైన శ్రీఅవధూత కాశినాయనస్వామి మహిమాన్వితుడిగా ప్రసిద్ధి చెందారు. కాశినాయన 29వ ఆరాధన మహోత్సవాలు శనివారం, ఆదివారం ఘనంగా జరగనున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం బెడుసుపల్లె గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన కాశినాయన చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతనకు అలవాటుపడ్డారు. ఆయన గురువు యతిరాజు గురవయ్య వద్ద ఆత్మజ్ఞానం పొందారు. అక్కడి నుంచి వైఎస్ఆర్ జిల్లా బద్వేలు నియోజకవర్గంలోకి ప్రవేశించి వరికుంట్ల, నాయునిపల్లె, గంగనపల్లె గ్రామాలకు చేరుకున్నారు. అక్కడ కొన్నేళ్ల పాటు చిన్నపిల్లలకు విద్యాబోధన చేస్తూ ఆధ్యాత్మిక చింతన కొనసాగించారు. ఆ సమయంలో వరికుంట్ల సమీపంలోని నల్లమల అడవుల్లోని జ్యోతిక్షేత్రంలో జ్యోతి నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. జ్యోతి నరసింహస్వామికి పూజలు చేస్తుండేవారు. సమీపంలోని గరుడాద్రి కొండ మీద కఠోరదీక్షతో తపస్సు చేశారు. అనంతరం అన్నదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ వచ్చేవారు.

**ఆలయాల పునరుద్ధరణకు కృషి**

అవధూతగా మారిన కాశినాయన శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. చుక్కనీరు దొరకని గరుడాద్రి కొండమీద నీటిబావులు తవ్వించారు. గరుడాద్రి, అనంతరాయుడు, జ్యోతి, సిద్దేశ్వరం, లింగమయ్యకొండ, యోగానందలోని ఆలయాలను పునరుద్ధరించారు. కర్నూలు జిల్లా నల్లమల అడవుల్లో ఉన్న అహోబిలం వద్ద యోగానంద ఆశ్రమం స్థాపించి.. పశు సంపద, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**నరసింహస్వామి పాదాల చెంత సమాధి**

వందేళ్లు జీవించిన కాశినాయన తన ఇష్టదైవమైన జ్యోతి నరసింహస్వామి పాదాల చెంత 1995 డిసెంబర్ 5న సమాధి అయ్యారు. ఆయన సమాధి చెందిన ప్రాంతంలో ఒక పురాతన మర్రిచెట్టు తనంతట తానే నేలవాలింది. ఆయన సేవిస్తూ వచ్చిన గోమాత కాశినాయన మరణాన్ని జీర్ణించుకోలేక మూడవ రోజున తనువు చాలించింది.

**దేవాలయం ఏర్పాటు**

కాశినాయన సమాధిపై అద్భుతమైన దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. 60 తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా 60 రాతి స్తంభాలతో 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా దేవాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆవు సమాధిని కూడా అందంగా నిర్మించారు. వంటశాలలు, భోజనశాలలు, వసతిగృహాల నిర్మాణాలతో జ్యోతిక్షేత్రం కళకళలాడుతోంది.

**నిత్యాన్నదానం**

కాశినాయన ఆశ్రమాన్ని దర్శించే భక్తులకు స్వామి దర్శనం ఎంత ఇష్టమో.. అక్కడ భోజనం చేసి రావడం అంత పవిత్రం. రోజూ వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భోజనం చేస్తుంటారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో భక్త జనం భారీగా వస్తుంటారు. ఏడాది పొడవునా అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుంది. రైతులు తాము పండించిన పంటలో కాశినాయన పేరున తీసి ఉంచిన ధాన్యం, కూరగాయలు, పప్పుధాన్యాలు ఆశ్రమానికి తమకు తాముగా చేరవేస్తుంటారు. దీంతో అన్నదానం సజావుగా సాగుతోంది.

**నేడు జ్యోతి ప్రజ్వలన**

రెండు రోజుల పాటు జరిగే కాశినాయన ఆరాధన మహోత్సవాలకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మైదుకూరు ఆర్టీసీ డిపో వారు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కాశినాయన మాలను ధరించి కొంత మంది భక్తులు దీక్షలో కొనసాగుతున్నారు. వీరంతా ఈ నెల 14వ తేదీ రాత్రికి జ్యోతిక్షేత్రానికి చేరుకుని జ్యోతి ప్రజ్వలనలో పాల్గొంటారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కాశినాయన ఎస్ఐ హనుమంతు, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డిలు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

### కోడిపందెం ఆటగాళ్ల అరెస్ట్

**రాయచోటి :** రాయచోటి మండలం మాధవరం మద్దెలకుంట సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పందెం ఆడుతున్న ఎనిమిది మందితోపాటు ఆరు కోళ్లు, 21 బైకులు, రూ.14500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, శనివారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్పీ, స్పెషల్ పార్టీ పోలీసులు మెరుపుదాడి చేసినట్లు సమాచారం.

### జూదరుల అరెస్ట్

**మదనపల్లె :** పట్టణంలోని రామిరెడ్డి లేఅవుట్‌లో శుక్రవారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25,750 స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**అట్లూరు :** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అట్లూరు అటవీ చెక్‌పోస్టు దగ్గర కడప–బద్వేలు ప్రధాన రహదారిపై శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సిద్దవటం మండలం పెన్నానది నుంచి ఇసుకను తీసుకుని వస్తున్న నాలుగు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి అట్లూరు తహసీల్దారుకు అప్పగించారు. వాహనాల యజమానులు తహసీల్దారు దగ్గర జరిమానా చెల్లించి ట్రాక్టర్లను తీసుకెళ్లారు.

# వృద్ధులపై యువకుడి దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- మద్యం మత్తులో వీరంగం

**గుర్రంకొండ :** పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధులపై.. ఒక్కసారిగా ఓ యువకుడు దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతను మద్యం మత్తులో గ్రామంలో వీరంగం సృష్టించాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని మర్రిమాకులపల్లె కస్పాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం.జయరామిరెడ్డి, ఆయన కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి చాలా ఏళ్ల క్రితం గ్రామం వదిలి బతుకుదెరువు కోసం వెళ్లారు. ఏడు నెలల కిందట వారు గ్రామంలోకి వచ్చి సొంత ఇంట్లో నివాసముంటున్నారు. ఆరునెలల కిందట జయరామిరెడ్డి మృతి చెందాడు. అప్పటి నుంచి దిలీప్‌కుమార్‌రెడ్డి ఒంటరిగా ఉంటున్నాడు. ఇతని తల్లి చిన్నతనంలో మృతి చెందింది. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గ్రామంలో రచ్చబండ వద్ద పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధురాళ్లపై అతను ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. కట్టెలతో ఇష్టానుసారంగా చితకబాదాడు. ఓ ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న ఇద్దరు వృద్ధురాళ్లను కొట్టాడు. ఈ సంఘటనలో కె.రామలక్ష్మమ్మ(75), కె.లక్ష్మమ్మ(80), హైమావతమ్మ(60), ఈశ్వరమ్మ(55), ఎస్.లక్ష్మమ్మ(65), కత్తి లక్ష్మమ్మ(60)కు గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి కాళ్లు విరిగిపోయాయి. బాధితులను గ్రామస్తులు 108 వాహనం ద్వారా వాల్మీకిపురం, మదనపల్లె ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. దిలీప్‌కుమార్‌రెడ్డి కట్టెలు చేతపట్టుకొని గ్రామంలో వీరంగం సృష్టించడంతో.. గ్రామస్తులు భయాందోళనతో పరుగులు తీశారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బందితో వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా దిలీప్‌కుమార్‌రెడ్డి గ్రామంలో పలువురు చిన్నారులను కిడ్నాప్ చేయడానికి యత్నించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మీ పిల్లల్ని కిడ్నాప్ చేస్తున్నామని పలువురు చిన్నారుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి బెదిరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఓవైపు కిడ్నాప్ కలకలం, మరోవైపు వృద్ధులపై దాడులతో మర్రిమాకులపల్లెలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

### గాయపడిన బాలుడి మృతి

**రాయచోటి :** బండరాయి విరిగిపడి గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిపోగు సన్నీ (12) శుక్రవారం మృతి చెందాడు. రాయచోటి మండలం దిగువ అబ్బవరం పాత దళితవాడకు చెందిన బాలిపోగు నరేష్ కుమారుడు సన్నీ నవంబర్ 29న తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ సందర్భంలో బండరాయిని పట్టుకొని ఊగుతుండగా.. ఆ రాయి విరిగి మీదపడటంతో గాయపడ్డాడు. వెంటనే తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ జహీర్ తెలిపారు.

### వ్యక్తి మృతిపై కేసు నమోదు

**రామసముద్రం :** మండల పరిధి చెంబకూరు–ఈడిగపల్లె మార్గంలోని నల్లచిన్నేపల్లె క్రాస్ వద్ద ఆదివారం రోడ్డుప్రమాదంలో గాయపడి, మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె పంచాయతీ దిగువకొండమీద పల్లెకు చెందిన వెంకటరమణ(66) తన సొంత పని మీద ద్విచక్రవాహనంపై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### వైవీయూ క్రీడా పోటీలు

**వైవీయూ :** యోగి వేమన విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో అంతర కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు వైవీయూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 20న యోగ, 24న ఖోఖో పోటీలు స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. ఎంపికల్లో పాల్గొనదలచిన విద్యార్థులు 2024 జూలై 1వ తేదీ నాటికి 17– 25 ఏళ్ల మధ్య వయసు కలిగి, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ, పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్క్స్ మెమోలు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు :9705459052, 7997047676కు సంప్రదించాలని వివరించారు.

### 15న జిల్లా ఆర్చరీ జట్టు ఎంపిక

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఈ నెల 15న జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రికర్వ్‌రౌండ్, కాంపౌండ్ రౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆర్చరీ అసోసియేషన్ పోర్టల్‌లో రిజిస్టర్ కానివారు గూగుల్ ఫారం పూరించి ఈనెల 15న రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు.

# అల్లు అర్జున్ అరెస్టు రాజకీయ కుట్ర


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు అర్బన్ :** రాజకీయ కుట్రలో భాగంగానే హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రైల్వేకోడూరులో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పుష్ప–2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో సోదరి రేవతి మరణించడం బాధాకర విషయమన్నారు. దీనిని హత్యగా అభివర్ణించి అందుకు అల్లు అర్జున్‌ను బాధ్యున్ని చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ప్రత్యక్షంగా ఇది పోలీసులే చేసినా పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేయించారన్నారు. వారి హస్తం లేకపోతే, ఇందులో రాజకీయ కోణం దాగి ఉండకపోతే, తెలంగాణ ప్రభుత్వం ఇంతటి సాహసం చేయదన్నారు.

**ఎన్నికల ప్రచారానికి రావడమే తప్పా**

సినీ హీరో అల్లు అర్జున్ గడిచిన ఎన్నికల సందర్భంగా నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్ప రవి చంద్ర కిశోర్‌రెడ్డికి మద్దతు తెలపడమే కారణమని తెలిపారు. తమ పార్టీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాడని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎక్కడలేని ఆక్రోశం చెందారన్నారు. ఆనాటి నుంచి అల్లు అర్జున్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం హైకోర్టు మధ్యంతర బెయిల్ లభించడం అల్లు అర్జున్‌కు కాస్త ఊరట లభించిందని, ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

**చంద్రబాబు సభల్లో మరణాలకు బాధ్యుడెవరు?**

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు నాయుడు 2015 జూలై 14న గోదావరి పుష్కరాల సందర్భంగా సినిమా షూటింగ్ తరహాలో చేయడం వల్ల జరిగిన తొక్కిసలాటలో 35 మంది చనిపోయారన్నారు. ఈ సంఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. అలాగే గత ఎన్నికల సందర్భంగా కందుకూరు సభలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. జనాన్ని చూపించేందుకు చంద్రబాబు ఇరుకు సందులో మీటింగ్ ఏర్పాటు చేసి వారి మరణాలకు కారణమయ్యారన్నారు. ఈ మరణాలకు బాధ్యుడు చంద్రబాబు కాదా అని ఆయన ప్రశ్నించారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


రైతుల భూ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జేసీ ఆదర్శ్ రాజేందర్

**రామాపురం :** భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేందర్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె సచివాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్న మండలాల్లో రామాపురం ఒకటన్నారు. మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల రైతుల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మండల అధికారులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మణి, తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐలు సమ్మత్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, టీడీపీ నాయకుడు అయోధ్యపురం పట్టాభిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# 15న కళాశాలల యాజమాన్యాల సమావేశం


**వైవీయూ :** వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు పట్టణంలోని ఆర్.ఇ.ఎస్ జూనియర్ కళాశాల (మేధా డిఫెన్స్ అకాడమీ)లో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.నరసింహులు తెలిపారు. జిల్లా కమిటీ కాలపరిమితి ముగిసినందున సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జూనియర్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించనున్నట్లు తెలిపారు. సంబంధికులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

### ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన


ఐజీ కార్ల్‌లో రైతు పొలం పరిశీలిస్తున్న ఇటలీ రీసెర్చర్ అన్న డి

**పులివెందుల రూరల్ :** పులివెందులలోని ఐజీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను ఇటలీ దేశ రీసెర్చర్ అన్న డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి మాట్లాడుతూ ఇటలీ రీసెర్చర్ అన్న డి అనే మహిళ ఈ నెల 19 వరకు పులివెందులలో ఉండి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలు, మోడల్స్‌ను పరిశోధన చేయడానికి ఐజీ కార్ల్‌కు వచ్చారన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ పులివెందుల డివిజన్‌లో ఎక్కువ రైతులు సాగు చేసే పంటలలో ప్రధానంగా అరటి, శనగలో ఏ గ్రేడ్ మోడల్ విధానాలు చేయించడం జరిగిందన్నారు. అదే విధంగా ఏటీఎం మోడల్స్, పీఎండీఎస్ విధానాలు చూడవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సోహెల్, మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యమైన, నిరంతర విద్యుత్తే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్‌రామ్ సింగ్

**కడప కార్పొరేషన్ :** వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఏపీఎస్పీడీసీఎల్‌లోని కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు, ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థల సేకరణలు పూర్తి చేసి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించుటకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజలకు అందించే విద్యుత్తు సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వారికి పరిహారం చెల్లించే విధంగా ప్రమాణాలు తీసుకురావడం జరిగిందన్నారు. వీటిని పటిష్టంగా ఆచరణలో పెట్టి విద్యుత్ సేవల్లో జాప్యం లేకుండా సంతృప్తికర స్థాయిలో అందించాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే ప్రతి ఉద్యోగి సంస్థకు వినియోగదారులకు మధ్య వారధిగా ఉంటారని, కావున జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, ప్రమాదాల నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. డిస్కం, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ఎప్పటికప్పుడు సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసుకుని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ కృష్ణమనాయుడు, ఓఎస్‌డీ మునిశంకరయ్య, ఎస్ఈ రమణ, ఏఓ మధు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు. అంతకుముందు ఏపీఈఆర్‌సీ చైర్మన్ పాత కడప సబ్‌స్టేషన్‌ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

**ఖాజీపేట :** విజిలెన్స్ అధికారులు వినూత్న రీతిలో దాడులు నిర్వహించారు. రైతుల వేషధారణతో ఎరువులు, పురుగుల నివారణ మందుల దుకాణాలకు వెళ్లి.. దుకాణదారుల భరతం పట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేటలో కొంత కాలంగా ఎరువులు, పురుగు నివారణ మందులు అధిక ధరకు, నాసిరకమైన వాటిని అమ్ముతున్నారని రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో అన్నదాతలు విజిలెన్స్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు సాధారణ రైతుల వలే.. ఫిర్యాదులు వచ్చిన దుకాణాల వద్దకు వెళ్లారు. యూరియా, పాస్పేట్ బస్తాలను కొనుగోలు చేశారు. యూరియా ధర రూ.266.50 ఉండగా 350కు, పాస్పేట్ 20:20 రూ.1200 ఉండగా 1300కు దుకాణదారులు విక్రయించారు. డబ్బు నగదు రూపంలో కాకుండా ఫోన్ పే ద్వారా చెల్లించారు. దీంతో దుకాణదారులు విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికి పోయారు.

**జరిమానా**

అధిక ధరకు అమ్మినందుకు, బస్తాల్లో తేడా ఉన్నందుకు లక్ష్మి గణేష్ దుకాణం యజమానికి రూ.60 వేలు, వేంకటేశ్వర రైతు డిపోదారులకు రూ.40 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేశారు.

**వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో..**

**కడప అర్బన్ :** విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో దాడులు నిర్వహించారు. కడప విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండల కేంద్రం, అన్నమయ్య జిల్లా పీలేరు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు జవహర్‌రెడ్డి, బాల గంగాధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి విజయ్‌కిశోర్, ఏఈఈ అశోక్‌కుమార్, ఏఈఈ ఖాజా హుసేన్, డీసీటీఓలు బాబు మోజెస్, రమేష్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, నాగార్జున, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డుల సేవలు అభినందనీయం


హోంగార్డ్స్ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్

**కడప అర్బన్ :** హోంగార్డుల సేవలు అభినందనీయమని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్‌కుమార్ తెలియజేశారు. కడపలోని ఏఆర్ పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన శుక్రవారం హోంగార్డ్స్ పరేడ్‌ను పరిశీలించి, దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. ఇన్సూరెన్స్ (బీమా) చేసుకోవాలన్నారు. ఏడాదికి ఒకసారి మెడికల్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ హోంగార్డ్స్ డీఎస్పీ కేఎస్‌వీ ప్రసాద్, ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.